సాక్షి
గుంటూరు
శనివారం । 4 । అక్టోబర్ । 2025



మిషన్ వాత్సల్యపై అవగాహన

ముప్పాళ్ల: పల్నాడు జిల్లా ముప్పాళ్లలో మిషన్ వాత్సల్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను కో ఆర్డినేటర్ సంతోష్ వివరించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,01,210 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 1,85,107 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత నిల్వ 42.1600 టీఎంసీలు.



కొండ చిలువ కలకలం

కొల్లూరు : కరకట్ట దిగువన పెసర్లంక నక్క పాయ గండి వద్ద శుక్రవారం కొండ చిలువ కనిపించింది. వరదలో కొట్టుకు వచ్చిన దీన్ని చూసి స్థానికులు భయాందోళనలకు గురయ్యారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలో పదవులు




పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన పలువుర్ని వివిధ పదవుల్లో నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) మెంబర్లుగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన మేకతోటి సుచరిత, మంగళగిరి నియోజకవర్గానికి చెందిన మురుగుడు హనుమంతరావు, గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన మందపాటి శేషగిరిరావు, ఎస్ఎం జియావుద్దీన్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఆతుకూరి ఆంజనేయులును నియమించారు. అదే విధంగా స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) మెంబర్‌లుగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన కొలకలూరి కోటేశ్వరరావు, పొన్నూరు నియోజకవర్గానికి చెందిన నల్లమోతు రూత్‌రాణిలను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

ముగిసిన దేవి శరన్నవరాత్రులు



పెదకాకాని: శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో దసరా నవరాత్రుల చివరి రోజు గురువారం భ్రమరాంబ అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చివరి రోజు గురువారం ఉదయం 10.30 గంటలకు పూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ స్థానాచార్యుడు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకుడు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం శమీపూజ వైభవంగా జరిగింది. అనంతరం ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంపై భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. పెదకాకాని పురవీధులలో మేళతాళాలు, కోలాటం, భజన బృందాల నడుమ గ్రామోత్సవం కనులపండుగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ స్వామి, అమ్మవార్లను కనులారా దర్శించుకున్నారు. ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు



తాడేపల్లి రూరల్: సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై విజయదశమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో శుక్రవారం ఉదయం 9 గంటలకు వెంకటేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకం, 11 గంటలకు శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, శమీవృక్ష ఆరాధన, వెంకటేశ్వరస్వామి వారికి అష్టోత్తర శతనామార్చన నిర్వహించామని తెలిపారు.

బాబా సేవలో పీవీ సింధు



పెదవడ్లపూడి(మంగళగిరి): పెదవడ్లపూడిలోని భగవాన్ సత్య షిరిడీ సాయిబాబాను శుక్రవారం ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోశాలలో గోపూజ నిర్వహించారు. తొలుత ఆలయ చైర్మన్ పాతూరి నాగభూషణం, కమిటీ ప్రతినిధులు సింధు దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

భజే భవానీ అంటూ అమ్మవారి జయజయధ్వానాల మధ్య దేవీ శరన్నవరాత్రుల్లో ఆఖరి అంకం ఘనంగా ముగిసింది. ఉత్సవాల్లో విజయదశమి రోజున అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచి భవానీలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఇంద్రకీలాద్రి పరిసరాలు అమ్మ నామస్మరణతో మార్మోగాయి. దుర్గమ్మ సన్నిధిలో పూర్ణాహుతి చేయడంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి.

జయ మంగళం

వైభవంగా ముగిసిన దసరా ఉత్సవాలు

- విజయదశమి రోజున భక్తులతో కిక్కిరిసిన ఇంద్రకీలాద్రి
- వరద నేపథ్యంలో ఆదిదంపతుల నదీ విహారం రద్దు
- హంసవాహనంపై పూజలతో సరి
- దుర్గమ్మ సన్నిధిలో కొనసాగుతున్న భవానీల రద్దీ



సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్యం చేస్తున్న కళాకారిణి



హంస వాహన సేవ కోసం ఆది దంపతులను ఊరేగింపుగా తీసుకువస్తున్న సిబ్బంది



శ్రీరాజరాజేశ్వరీదేవికి హారతి ఇస్తున్న అర్చకుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల రాకతో కృష్ణమ్మ పులకించింది. దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదిదంపతులకు హంస వాహన సేవ జరిగింది. కృష్ణానది వరద నేపథ్యంలో శ్రీ గంగా పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్లకు ఏటా నిర్వహించే నదీ విహారాన్ని రద్దు చేశారు. హంస వాహన సేవను మాత్రమే నిర్వహించగా, సేవను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు కృష్ణానది తీరానికి చేరుకున్నారు. హంస వాహనంపై అధిష్టించిన ఆదిదంపతులకు ఆలయ ఈవో శీనానాయక్ దంపతులు పూజాకార్యక్రమాలను నిర్వహించారు. హంస వాహనంపైకి ఆలయ ఈవో, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ దంపతులతో పాటు వేద పండితులు, ఆలయ అర్చకులను మాత్రమే అనుమతించారు. హంస వాహనంపై కొలువు తీరి పూజలందుకుంటున్న ఆది దంపతులను ప్రకాశం బ్యారేజీ, దుర్గాఘాట్, దుర్గ గుడి ఫ్లైఓవర్, భవానీ ఘాట్ల నుంచి భక్తులు దర్శించుకున్నారు. సాయం సంధ్య వేళ దుర్గాఘాట్‌లో కృష్ణమ్మకు నవ హారతులను ఇవ్వగా, అదే సమయంలో హంస వాహన సేవ జరిగింది. ఒకే సమయంలో రెండు సేవలను వీక్షించే మహాభాగ్యం భక్తులకు కలిగింది.

క్యూలైన్ల ద్వారానే..

భవానీలు, భక్తుల రాకతో మరో రెండు రోజుల పాటు ఉత్సవ ఏర్పాట్లు కొనసాగుతాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు. శని, ఆదివారాలలో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులు క్యూలైన్ల ద్వారానే కొండపైకి చేరుకోవాలని సూచించారు. అంతే కాకుండా వీఐపీ దర్శనాలు ఉండవని పేర్కొన్నారు. శ్రీరాజరాజేశ్వరిదేవిగా దుర్గమ్మను గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ జ్యోతిర్మయి, హీరో శర్వానంద్, నటుడు ఓంకార్‌లతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు అమ్మవారిని దర్శించుకున్నారు.

కనులపండువగానగరోత్సవ సేవ

హంసవాహన సేవ కోసం ఆది దంపతులు దేవస్థానం నుంచి ఊరేగింపుగా బయలుదేరారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల నుంచి ప్రారంభమవగా.. ఆలయ అధికారులు ఆదిదంపతుల పల్లకీకి భుజం పట్టగా, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తజనుల కోలాట నృత్యాల మధ్య దుర్గాఘాట్‌కు బయలుదేరింది. దుర్గాఘాట్‌కు చేరుకున్న ఆదిదంపతులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నదీ ప్రవాహం అధికంగా ఉండటంతో హంస వాహనంపైకి కేవలం 25 మందిని మాత్రమే అనుమతించారు. అనంతరం హంసవాహనంపై అధిష్ఠించిన ఆదిదంపతులను త్రిలోక సంచారానికి గుర్తుగా మూడు పర్యాయాలు హంస వాహనాన్ని ముందుకు వెనక్కి నడిపించారు.



హంస వాహనంపై కొలువుదీరిన ఆదిదంపతులు

శమీ శమయతే పాపం



అమరావతి: అమరారామంలో వేం చేసియున్న శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో దసరా శరన్నవ రాత్ర్యుత్సవాలలో భాగంగా గురువారం రాత్రి 7 గంటలకు చండీసమేత అమరేశ్వరస్వామికి పారువేట ఉత్సవం నిర్వహించారు. ఆలయంలోని రెండో ప్రాకారంలోని జమ్మిచెట్టు వద్ద శమీపూజను ఆలయస్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

రాజరాజేశ్వరిగా బాలచాముండేశ్వరీదేవి

అమరావతి క్షేత్రంలో శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా ఆశ్వీయుజ శుద్ధ దశమి కావటంతో విజయదశమిని పురస్కరించుకుని బాలచాముండేశ్వరి అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. దసరా వేడుకలలో చివరిరోజు రాజరాజేశ్వరీదేవిగా అలంకారంలో బాలచాముండేశ్వరి అమ్మవారు భక్తులదర్శనమిచ్చారు.

ఏపీపీ రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు



గుంటూరు రూరల్: ఈ నెల 5వ తేదీన గుంటూరు–పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల రాత పరీక్ష ఏర్పాట్లను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) రమణమూర్తిలతో కలిసి ఏర్పాట్లపై చర్చించారు.







కల్యాణం.. కమనీయం..

గుంటూరులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారులు, కళాకారుల కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

మహనీయుల సేవలు చిరస్మరణీయం

గుంటూరు వెస్ట్: దేశాభివృద్ధి కోసం మహనీయులు చేసిన సేవలను ఎప్పటికీ మరులేమని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా తెలిపారు. గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగర పాలక కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.ఎస్. కె.ఖాజా వలి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో ఇంతటి స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవిస్తున్నామంటే మహానుభావుల త్యాగ ఫలమేనన్నారు. ప్రతిఫలం ఆశించకుండా వారు చేసిన సేవలు నేటి యువత తెలుసుకుని, వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు.

సాగును లాభసాటిగా మార్చాలి

వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పెట్టుబడులు తగ్గి రైతులకు లాభాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాథమిక రంగాల శాఖలు నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తూ లాభదాయకత పెరిగేలా చూడాలని ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలను ముందుగా గుర్తించాలని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు సేవ కేంద్రాల స్థాయిలో లక్ష్యాలను నిర్దేశించామని తెలిపారు. పంటల వారీగా సమస్యలను గుర్తించామని చెప్పారు.



గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

రైతులు మొక్కజొన్న, మినప పంటలకు మారుతున్నారని తెలిపారు. పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి. సత్యనారాయణ సీపీఓ శేషశ్రీ, జిల్లా మత్స్య శాఖ అధికారి పి.ఎస్. కిరణ్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ అవార్డులు రావడం అభినందనీయం

గుంటూరు జిల్లాకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 5 రాష్ట్ర స్థాయి, 48 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయని తెలిపారు. వివరాలను స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర పోర్టల్‌లో పొందుపరిచామన్నారు. అధికారులు, సిబ్బంది కృషిని అభినందించారు.

వాయు నాణ్యతాప్రమాణాలు పెంచండి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వాయు నాణ్యతాప్రమాణాలను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం ద్వారా జీఎంసీ పరిధిలో చేపడుతున్న పనుల పురోగతిపై జిల్లా స్థాయి అమలు కమిటీతో కలెక్టర్ సమీక్షించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెడికల్ క్లబ్ రోడ్డు, పొన్నూరు రోడ్డు బీటీ పనులకు, మియావాకీ ప్లాంటేషన్‌కు రూ.3.56 కోట్లతో వచ్చిన ప్రతిపాదనలకు ప్రాథమికంగా ఆమోదం తెలిపారు.

అనుమతులు ఇవ్వండి

పరిశ్రమలు, సేవా రంగాల్లో అనుమతులు సత్వరం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సెకండరీ, సేవా రంగాలలో జిల్లాలో ఉత్తమ ప్రగతి రావాలన్నారు.

అభివృద్ధిలో యంగ్ ప్రొఫెషనల్స్ కీలకం

నియోజకవర్గ స్థాయిలో 'యంగ్ ప్రొఫెషనల్స్' ఆ ప్రాంత అభివృద్ధిలో కీలక భూమిక పోషించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, యంగ్ ప్రొఫెషనల్స్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. యువత విజ్ఞానం వృథా కాకుండా సమాజ అభివృద్ధికి ఉపయోగపడేలా కృషి చేయాలన్నారు. జెడ్పీ సీఈఓ జ్యోతి బసు, వ్యవసాయ శాఖ జేడీ అయితా నాగేశ్వర రావు, గుంటూరు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు వెస్ట్: ఖరీఫ్ సీజన్‌లో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా నిర్ణయించామని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా ధాన్య సేకరణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లాలో 3,89,849 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా ఉందన్నారు. ఇందులో ఈ ఏడాది డిసెంబర్ నుంచి 50 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 177 రైతు సేవ కేంద్రాలు, 45 రైతు సేవ క్లస్టర్ల ద్వారా ధాన్యం సేకరిస్తామని పేర్కొన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 చొప్పున ఇచ్చి కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ అధికారులు ఇ-పంట, ఇ - కేవైసీ వంద శాతం పూర్తి చేయాలన్నారు. పంట రకాన్ని గుర్తించాలని, తేమ శాతం అధికంగా లేకుండా చూడాలని చెప్పారు. ధాన్యం సేకరణ నిబంధనలను రైతులకు తెలియజేయాలన్నారు. రైతుల ఎంపిక మేరకు పంటను సంబంధిత మిల్లులకు తరలించేలా సివిల్ సప్లయిస్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ ఉండేలా రవాణా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తేమ శాతం అధికంగా ఉంటే డ్రయర్లను ఉపయోగించుకోవాలన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్‌లు సరఫరా చేసేందుకు మార్కెటింగ్ శాఖాధికారులు, ధాన్యం తూకానికి సంబంధించి లీగల్ మెట్రాలజీ అధికారులు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్‌కు సరిపడా హమాలీలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మిల్లర్లు మాట్లాడుతూ.. టార్పాలిన్‌లను సబ్సిడీపై అందించాలని కోరారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని విన్నవించారు. ఈ విషయాలను ప్రభుత్వానికి తెలియజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ జీఎం పి.జయంతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయండి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు వెస్ట్: వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు త్వరితగతిన మరమ్మతులు చేయాలని అధికారులను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. పంచాయతీరాజ్ , రహదారులు- భవనాల శాఖ రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన అంశాలపై గుంటూరులోని స్థానిక శంకరన్ మినీ మీటింగ్ హాల్లో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాతో కలసి అధికారులతో డాక్టర్ పెమ్మసాని సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాబార్డ్ గ్రాంట్, నరేగా పథకం కింద అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న అనేక ఆర్ అండ్ బీ రోడ్లు వర్షాల కారణంగా దెబ్బతిన్నాయని గుర్తుచేశారు. రోడ్లన్నీ తమకు అప్పగిస్తే లోకల్ ఫండ్స్ సేకరించి నిర్మాణానికి సహకరిస్తామని అధికారులకు సూచించారు. ఆర్ అండ్ బీ పరిధిలోని రోడ్లను మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగించాలని కోరినట్లు తెలిపారు. నాబార్డ్ సంబంధిత 16 పనుల్లో 6 మొదలే కాలేదన్నారు. గుంటూరు-అమరావతి రోడ్డు నిర్మాణానికి రూ. 6.30 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనుల్లో 115 పైగా పనులు ఇంకా మొదలు కాలేదని తెలిపారు. ప్రతి పనిని కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని పేర్కొన్నారు. వర్షాల కారణంగా రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని, అందరూ సహకరిస్తేనే సమస్యలు పరిష్కరించవచ్చన్నారు. సమావేశంలో గుంటూరు కార్పొరేషన్ మేయర్ కోవెలమూడి రవీంద్ర బాబు, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, ఈఈ విశ్వనాథరెడ్డి, డీఈ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **1,400** గరిష్టం : రూ. **2,000**

మోడల్ ధర రూ. **1,700**

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	9,005
అమ్మకాలు	9,599
నిల్వ	4,121

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,200
నంబరు–5	10,000–14,100
341	10,000–14,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,400
నంబరు–5	10,000–14,000
341	10,000–15,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,800
బాడిగ–355	10,000 – 15,000
ఆర్మూర్	9,800 – 12,000
తాలుకాయలు	6,000 – 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,700
బాడిగ – 355	10,000–15,000
తాలు	5,200 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

క్లుప్తంగా

ప్రజలు స్వేచ్ఛగా జీవించాలి



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్‌లోని ప్రతి జిల్లాలో శాంతిభద్రతలు సుభిక్షంగా ఉండాలని, ప్రజలు స్వేచ్ఛగా జీవించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని రేంజ్ ఐజీ కార్యాలయంలో దుర్గామాతకు విశేష పూజలు నిర్వహించారు. రేంజ్ ఐజీ మాట్లాడుతూ ప్రజలకు సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి మిఠాయిలు అందించారు. కార్యక్రమంలో సీఐలు ఫిరోజ్, ఆరోగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు వైఎస్సార్‌సీపీ ఘన నివాళులు



గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న మోదుగుల వేణుగోపాలరెడ్డి, అంబటి మురళీకృష్ణ, వనమా బాల వజ్రబాబు, పార్టీ నేతలు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): జాతిపిత గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఘన నివాళులు అర్పించారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బాపూజీ, శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎంపీ, పార్టీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ అహింసతో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన మహనీయుడు గాంధీ అని కీర్తించారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ మహాత్ముడు ఆశించిన శాంతికి విరుద్ధంగా రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన కొనసాగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన డిజిటల్ బుక్ ద్వారా అన్యాయానికి పాల్పడిన ప్రతి ఒక్కరిని చట్టం ముందు నిలబెడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, గులాం రసూల్, మండేపూడి పురుషోత్తం, ఉడుముల పిచ్చిరెడ్డి, బైరెడ్డి రవీంద్రారెడ్డి, పఠాన్ సైదాఖాన్, దానం వినోద్, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, ఓర్సు శ్రీనివాసరావు, పఠాన్ ముంతాజ్, వేలూరి అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పద్యనాటకం 'ఆదికవి నన్నయభట్టు'

ముగిసిన వీణా అవార్డ్స్ నాటకోత్సవాలు



బహుమతి అందుకుంటున్న దృశ్యం

తెనాలి: వీణా అవార్డ్స్ నాటకోత్సవాలు–2025 ఘనంగా ముగిశాయి. ముగింపు సభ గురువారం రాత్రి జరిగింది. పద్యనాటక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా శ్యామలాంబ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్–విజయనగరం సమాజం ప్రదర్శించిన 'ఆదికవి నన్నయభట్టు' నాటకం ఎంపికైంది. దీనికి ఉత్తమ రచన బహుమతిని కూడా శారద ప్రసన్న స్వీకరించారు. నన్నయ భట్టుగా నటించిన కె.సూర్యనారాయణకు ఉత్తమ నటుడిగా నిలిచారు. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా అక్కినేని సాంస్కృతిక సమాజం వారి 'మోహినీ భస్మాసుర' నాటకం ఎంపికైంది. భస్మాసురుడిగా నటించిన డి.తిరుపతినాయుడు ఉత్తమ ప్రతినాయకుడు బహుమతిని, మోహినీగా నటించిన కేవీ పద్మావతి ఉత్తమ నటిగా, నారదుడు పాత్రధారి గవర సత్తిబాబు ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా బహుమతులను గెలుచుకున్నారు. ఇదే నాటకానికి ఉత్తమ సంగీతం బహుమతిని కంది త్రినాథరావు అందుకున్నారు. చందాల కేశవదాసు కళాపరిషత్ – మధిర వారు ప్రదర్శించిన 'కస్తూరి తిలకం' నాటకానికి తృతీయ ఉత్తమ బహుమతి లభించింది. దీనికి దర్శకత్వం వహించిన ఎన్.సుబ్బరాజు ఉత్తమ బహుమతిని గెలుచుకున్నారు. పద్మశ్రీ కల్లూరి సుబ్బారావు, లలిత కళాపరిషత్ – అనంతపురం వారి 'కాలభైరవ సంహారం' నాటకానికి ఉత్తమ రంగోద్దీపనం బహుమతిని సురభి రాయల్ స్వీకరించారు. టీజీవీ కల్చరల్ అకాడమీ – కర్నూలు వారు ప్రదర్శించిన 'శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం' నాటకానికి ఉత్తమ ఆహార్యం బహుమతిని సి.శ్రీనివాసులు అందుకున్నారు. ఉత్తమ క్యారెక్టర్ నటి బహుమతిని 'పుత్రాదిచ్ఛేత్' నాటకంలో నాగులాంబ పాత్రధారి ఎన్.తిరుమల కైవసం చేసుకున్నారు. ఉత్తమ హాస్యనటిగా 'జగదేకసుందరి సామా'లో హసీనా, ఉత్తమ బాలనటుడిగా 'శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం'లో బాల వెంకటేశ్వరుడు గెలుచుకున్నారు.

సాంఘిక నాటక విభాగంలో ...

సాంఘిక నాటక విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్– వెలగలేరు వారి 'నల్లత్రాచు నీడలో' నాటకం ఎంపికైంది. ఉత్తమ నటి సురభి లలిత, ఉత్తమ ప్రతినాయకురాలు (నల్లత్రాచు నీడలో)ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా జయకళానికేతన్ – విశాఖపట్నం వారి 'సిరికేళి' నాటకం ఎంపికైంది. ఉత్తమ దర్శకుడిగా, ఉత్తమ నటుడిగా బహుమతులను జరుగుల రామారావు (అందరూ మంచివారే...కానీ), ఉత్తమ రచన శ్రీశైలమూర్తి (యాగం) అందుకున్నారు. ఉత్తమ ప్రదర్శనగా విజయవాడ సాంస్కృతిక సమితి వారి 'మమ్మల్నీ బ్రతకనివ్వండి' గెలుచుకుంది. ఇదే నాటికకు ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ సంగీతం, ఉత్తమ నటి, ఉత్తమ నటుడు బహుమతులు లభించాయి. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా పరమాత్ముని క్రియేషన్స్ –హైదరాబాద్ వారి 'ఎక్కడో...ఏదో' నాటిక ఎంపికైంది. ఇదే నాటికకు ఉత్తమ రచన బహుమతి లభించింది. ఉత్తమ తృతీయ ప్రదర్శనగా హర్ష క్రియేషన్స్ – విజయవాడ వారి 'భువి కోరని భ్రమణం' నాటిక ఎంపికైంది. బహుమతుల ప్రదానోత్సవంలో అజో విభో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, నాటకరంగ విశ్లేషకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, ఆర్ఎస్ఆర్ గ్రూప్స్– హైదరాబాద్ చైర్మన్ ఆర్.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆటో డ్రైవర్ల సేవలో..' ప్రారంభం

తాడేపల్లి రూరల్: 'ఆటో డ్రైవర్ల సేవలో.. ' పథకాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. తాడేపల్లి పరిధిలోని సీతానగరం ప్రకాశం బ్యారేజ్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉదయం 9.30 గంటలకు స్వయంగా ఆటో ఎక్కి పథకాన్ని ప్రారంభించనున్నారని పేర్కొంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తదితర మంత్రులు, అధికారులు పాల్గొననున్నట్లు ఆ ప్రకటనలో తెలిపింది.

జిల్లాలో 3,193 మంది లబ్ధిదారులు

గుంటూరు వెస్ట్: జిల్లాలో 13,193 మంది ఈ పథకం కింద లబ్ధి పొందనున్నారని కలెక్టర్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో చేబ్రోలు మండలంలో 453, దుగ్గిరాల 344, గుంటూరు అర్బన్ 5,078, గుంటూరు రూరల్ 319, కాకుమాను 131, కొల్లిపర 164, మంగళగిరి 516, మేడికొండూరు 404, పెదకాకాని 711, పెదనందిపాడు 153, ఫిరంగిపురం 250, పొన్నూరు 530, ప్రత్తిపాడు 281, తాడేపల్లి 383, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ 1038, తాడికొండ 440, తెనాలి 1338, తుళ్లూరు 399, వట్టిచెరుకూరు మండలంలో 261 మందికి లబ్ధి కలగనుందని తెలిపారు.

'ఇందిరానగర్ యూపీహెచ్‌సీ'కి ఉత్తమ అవార్డు

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని ఇందిరానగర్‌లో ఉన్న యూపీహెచ్‌సీ జిల్లా స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ హాస్పిటల్‌గా ఎంపికైనట్లు యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష పేర్కొన్నారు. యూపీహెచ్‌సీలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల జాబితాలో ఈ మేరకు పేరు ప్రకటించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. భవిష్యత్తులో మరింత పరిశుభ్రంగా ఉండేలా చూస్తామని, ఉత్తమ సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

జాతీయ స్థాయిలో గుంటూరు మెడికల్ కాలేజ్ సత్తా



డాక్టర్ సుందరాచారి

గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కాలేజ్ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ఇటీవల విడుదల చేసిన ర్యాంక్‌లలో మెరుగైన స్థానం కైవసం చేసుకుంది. డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి ప్రిన్సిపాల్‌గా గత ఏడాది నవంబరులో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే దీనికోసం కృషి చేశారు. రూ. 8 కోట్లతో దాతల సహాయంతో పలు వసతులు సమకూర్చారు. దీంతో తొలిసారి పోటీలో నిలిచిన కాలేజీ 42.1 శాతం మార్కులు సాధించింది. టీచింగ్, లెర్నింగ్ రీసోర్సెస్ విభాగంలో 69.96 శాతం మార్కులు వచ్చాయి. రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్ విభాగంలో వందకు 6, గ్రాడ్యుయేషన్ అవుట్ కమ్స్ విభాగంలో 74.11, అవుట్‌రీచ్ అండ్ ఇన్‌క్లిజివిటీ విభాగంలో 50.10, రిస్పెషన్ విభాగంలో 10.95 మార్కులు వచ్చాయి. వచ్చే ఏడాది టాప్ వంద కాలేజీలలో స్థానం పొందేలా కృషి చేస్తానని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ సంఘం రాష్ట్ర కమిటీ బాధ్యతల స్వీకరణ



సమావేశంలో సామినేని కోటేశ్వరరావు, సత్యనారాయణ, కోటిరావు తదితరులు

కొరిటెపాడు (గుంటూరు): ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కమిటీ గుంటూరులోని లక్ష్మీపురంలో ఉన్న అసోసియేషన్ సమావేశ మందిరంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించింది. రాష్ట్ర అధ్యక్షుడిగా సామినేని కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా పి.కోటిరావు, ఉపాధ్యక్షులుగా ఎంవీ సత్యనారాయణ, రమేష్‌రాజు, బి.ఉమామహేశ్వరరావు, పి.చలపతిరావు, గౌరవ సలహాదారుగా ఎల్.రఘురామిరెడ్డి, సభ్యులుగా డి.బ్రహ్మానందం, పి.వెంకటేశ్వరరెడ్డి, జి.కోటేశ్వరరావు, డి.సూర్యప్రకాశరావు, డి.చంద్రశేఖర్, కేవీ ప్రసాద్, సీహెచ్‌వీవీ ప్రసాద్ చౌదరి, సీహెచ్ అప్పారావు, కె.వి.రెడ్డి, ఎస్.సాయి నీత్ వెంకటరత్నం, వసంత ధీమంత్ సాయి, ఎ.క్రాంతిలు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ.. మిల్లులకు రావాల్సిన రూ.900 కోట్ల సబ్సిడీ మొత్తాన్ని తక్షణమే ఒకే వాయిదాలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లుపై యూనిట్‌కు రూ.2 రాయితీని బిల్లులోనే డిస్కౌంట్ ఇవ్వాలని సూచించారు. టెక్స్‌టైల్ పరిశ్రమల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కమిటీ కృషి చేస్తుందని వెల్లడించారు. రెండు సంవత్సరాలపాటు ఈ కమిటీ కొనసాగుతుందని తెలిపారు. నూతన కమిటీని పలువురు కాటన్ అసోసియేషన్ నాయకులు, స్పిన్నింగ్ మిల్లుల యజమానులు కలిసి అభినందనలు తెలిపారు.

పోలీసుల జోక్యంతో వృద్ధుడి అంత్యక్రియలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సురేష్

ఫిరంగిపురం: పోలీసుల జోక్యంతో ఓ వృద్ధుడి అంత్యక్రియలు జరిగాయి. పోలీసుల కథనం ప్రకారం ... మండలంలోని మేరికపూడి గ్రామానికి చెందిన డి.వెంకటరెడ్డి (89) సెప్టెంబర్ 30న మృతి చెందాడు. కొన్నేళ్లుగా గ్రామంలోని పెద్ద కుమార్తె సీతామహాలక్ష్మి వద్ద అతడు ఉంటున్నాడు. అంత్యక్రియల విషయమై కుమారుడు కోటిరెడ్డితో సీతామహాలక్ష్మికి విభేదాలు వచ్చాయి. కోటిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలానికి వెళ్లి వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. మృతదేహానికి గుంటూరులో పోస్టుమార్టం చేయించారు. ఇరు కుటుంబాల వారు సయోధ్యగా ఉంటేనే మృతదేహాన్ని అప్పగిస్తామని తేల్చిచెప్పారు. దీంతో కుమార్తెలు, కుమారుడు కలిసి వచ్చి శుక్రవారం గ్రామంలోని శ్మశాన వాటికలో పోలీసుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.

కాలువలో పడిన బాలుడు మృతి



ఆషిక్ రెహమాన్ మృతదేహం

తెనాలి రూరల్: ప్రమాదవశాత్తు కాలువలో పడిన బాలుడు మృతి చెందాడు. పట్టణ బాలాజీరావుపేటకు చెందిన ఆశిక్ రెహమాన్ (5) ఈ నెల ఒకటో తేదీన సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటూ అదృశ్యమయ్యాడు. తల్లిదండ్రులు స్థానిక పోలీసులను ఆశ్రయించగా, గాలింపు చేపట్టారు. ఇంటి సమీపంలోని పడమర కాలువలో బాలుడి మృతదేహాన్ని గురువారం ఉదయం గుర్తించారు. దీంతో పండుగ వేళ బాలాజీరావుపేటలో విషాదం అలుముకుంది. బాలుడి మృతి ప్రమాదవశాత్తు జరిగిందేనని, ఎటువంటి అనుమానాలు లేవని త్రీటౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు తెలిపారు.

ఖైదీల పునరావాసానికి సహకరించండి

నగరంపాలెం: స్థానిక బ్రాడీపేటలోని జిల్లా కారాగారం (జైలు)లో గురువారం గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఖైదీల సంక్షేమానికి చేపడుతున్న పునరావాస కార్యక్రమాలను జైలు సూపరింటెండెంట్ కాంతారాజ్ వివరించారు. ఈ క్రమంలో సమాజంలోని అన్ని వర్గాల వారి సహకారం అవసరమని పేర్కొన్నారు. నాలుగో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఆర్.శరత్ బాబు, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి షేక్ జియావుద్దీన్, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సీహెచ్ రమేష్ మాట్లాడారు. సమాజంలో ఖైదీలు స్థిరపడేలా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రధాన వక్తలు అభినందించారు. ఖైదీల పునరావాసం, సంస్కరణ కార్యక్రమాల్లో సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో జైలర్ కిరణ్, డిప్యూటీ జైలర్లు ఎ. కల్యాణ్‌బాబు, బి.శ్రీనివాసరావు, జైలు వైద్యులు లక్ష్మీసుధ, ప్రథిమా పాల్గొన్నారు.

6 నుంచి బాలల క్రికెట్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7వ తేదీల్లో ఉదయం 7.30 గంటలకు పేరేచర్లలోని నరేంద్రనాథ్ క్రికెట్ స్టేడియంలో టాలెంట్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు త్రీమెన్ కమిటీ సభ్యులు యు.మహతి శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ – 14, 16, 19 బాలురు, అండర్–15, 19 బాలికల విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. ఏసీఏ పరిశీలకుడు రవి చలం ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. సొంత కిట్‌తో రావాలని, ఎంపిక చేసిన క్రికెటర్లకు ప్రత్యేక శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

పండగ పూట పెను విషాదం

- వాగులో మునిగి ముగ్గురు మృత్యువాత
- నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో ఘటన



పూర్ణ గోపాలభరత్ మృతదేహం



ఉమా సాయికాంత్ (ఫైల్)



రాము మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

చందంపేట : మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చిన ముగ్గురు వ్యక్తులు తిరుగు ప్రయాణంలో స్నానం ఆచరించేందుకు కృష్ణా బ్యాక్ వాటర్‌లో దిగి ప్రమాదవశాత్తు మునిగి మృత్యువాత పడ్డారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని దేవరచర్ల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలికి చెందిన కేతావత్ రాము(32), బొల్లాపల్లి మండలం గండిగనుముల గ్రామానికి చెందిన వాంకుడావత్ పూర్ణ గోపాలభరత్ (22), అవనిగడ్డకు చెందిన ఉమా సాయికాంత్ (11)లతోపాటు పలు కుటుంబాలు దేవరచర్లలోని తుల్జా భవాని ఆలయంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు సెప్టెంబర్ 30న వచ్చారు. అక్కడే బస చేసి మొక్కులు చెల్లించుకున్న అనంతరం తిరుగుప్రయాణం సందర్భంగా గురువారం దేవరచర్ల గ్రామంలో కృష్ణా బ్యాక్ వాటర్, డిండి ప్రాజెక్టు జలాలు కలిసే చోట వాగులో స్నానం చేసేందుకు ఉమా సాయికాంత్ దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో వాగులో జారిపడి మునిగిపోయాడు. గమనించిన కేతావత్ రాము, పూర్ణ గోపాలభరత్‌లు కాపాడేందుకు వాగులోకి దిగారు. ఈత రాకపోవడం, వాగు లోతు ఎక్కువగా ఉండడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు.

వేర్వేరు చోట్ల చోరుల చేతివాటం

- తెనాలిలో కారు అద్దం పగలగొట్టి రూ. 15 లక్షల సొత్తు దొంగతనం
- కొల్లిపర మండలం తూములూరులోని ఇంట్లో రూ. 10 లక్షల బంగారం చోరీ



పగిలిన కారు అద్దం

తెనాలిరూరల్/కొల్లిపర: వేర్వేరు ఘటనల్లో సుమారు రూ. 25 లక్షల విలువైన సొత్తు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణలో ఉన్నతాధికారులుగా పని చేస్తున్న దంపతులు గురువారం రాత్రి తెనాలి పాండురంగపేటలో ఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వివాహానికి హాజరయ్యారు. కారులో వచ్చిన వీరు కన్వెన్షన్ సెంటరులోకి వెళ్లగా కారును డ్రైవరు అక్కడికి సమీపంలో ఓవర్ బ్రిడ్జి వెంబడి ఉంచాడు. ఫోన్ మాట్లాడుతుండగా.. దుండగులు కారు అద్దం పగలగొట్టి రూ. ఐదు లక్షల నగదు, వంద గ్రాముల బంగారు ఆభరణాలు, క్రెడిట్ కార్డులు, పాస్‌పోర్టు ఉన్న బ్యాగు చోరీ చేశారు. త్రీ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో...

కొల్లిపర మండలం తూములూరు గ్రామంలో మోటూరు మధుసూదనరావు వేరే గ్రామంలో రైస్ మిల్లు నడుపుతున్నారు. పిల్లలు హాస్టల్లో ఉండగా, భార్య ఇటీవల ఊరికి వెళ్లారు. తాళం వేసి ఉన్న ఇంటిని గమనించిన దుండగులు లోనికి ప్రవేశించి బీరువాలో ఉంచిన ఆభరణాలను చోరీ చేశారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు మధుసూదనరావుకు సమాచారమివ్వగా ఆయన వచ్చారు. దాదాపు 96 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొల్లిపర ఎస్ఐ పి. కోటేశ్వరరావు ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గాంధీ మార్గం అనుసరణీయం



నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, మల్లికాగార్గ్ దంపతులు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): మహాత్మాగాంధీ సత్యం, అహింస, శాంతి, సామరస్యం వంటి సిద్ధాంతాలను అవలంబించి దేశాన్ని స్వాతంత్ర్యం వైపు నడిపించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గురువారం నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో గాంధీ, మాజీ ప్రధాని లాలాబహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఆయన సతీమణి రాష్ట్ర పోలీస్ సాంకేతిక విభాగ ఎస్పీ మల్లికా గార్గ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) ఎ.హనుమంతు, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, ఎస్‌బీ సీఐ అలహరి శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.